# కొత్తొంత్తైన - పాతనీరు

ఆమె లేచి లంగావేసుకుని, ఓణీ మడతలు సరిజేసి, జాకెట్టు బిగించు కుంటూ వుంది. "నేను చూడ్డంలేదు" అని అంటున్న ప్రభాకరం, ఆమె కంటిమీదవుంచిన చేతివేళ్ళ సందుల్లోంచి చూస్తూ రెండోచేత్తో ఆమె మెడని తన వక్షం పైకివొంచి, మెడని గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు. మెడలో రక్తనాళాలు మధురంగా కదిలిన స్పర్శ అతనికిష్టం. నిన్న రాసిన తైలం ఎండిన వొంకులజడ వూడి, అతని మొహాన్ని నిశీధిలా కప్పిన క్షణంలో ఏదో వెలుగుని చూసిన తన్మయత చెందుతాడు. ఆమె శరీరంలో పరిమళం అతనెరుగును. వేసంగిలో ఎండి దిగజారుతున్న కాలవమీద వర్షంపడి నీటిని కదపగా వొచ్చిన పరిమళం. మండుటెండలో సర్వేచెట్ల సమూహం ఇసుకలో పరిచిన నీడల చల్లదనం ఆమె కనురెప్పకింద వుంచే, వాటిని పెదవులతో పైకికదిపి స్పృశిస్తాడు. అర్ధరాత్రి ఎడారినడుమ వెలిగించిన కొవ్వొత్తులల్లె మెరిసే ఆమె పళ్ళవరసలో పరమసత్యం పరామర్శిస్తాడు. ఆమె స్తనాల నడుమ, పిరమిడ్ల నడుమ కూడా దొరకని ప్రశాంతత అతని నుదుటికి తెలుసు. వెనక్క, ముందులు తనని వెంటాడి జయించిన నాడు తన నుదిటిని ఆమె వక్షంపై పగులగొట్టుకుని హతుడవుతాడు. ఆమె నగ్నశరీం ఒక రోజాపుష్పమై, అతని గుండెకాయగా లోన క్రమంతో కొట్టుకుంటుంది .... అతనిలో ఎర్రని పరిమళంగా. ఆ చీరలు, ఆ జాకెట్లు, ఆలంగాలు, రోజాపుష్పం ముళ్ళు—— భరించాలి; కోస్తే రక్తం చిందుతుంది-యుగ యుగాలుగా చెందిన పరిణామంలోచిక్కబడుతూవచ్చిన రక్తంలో ఎరుపు; రోజాపుష్పంలో ఎరుపు.

పుష్ప పరిమళంలాంటిది ఆమె కంఠంతో ధ్వని. తెల్లారగట్ల చీకటి చావలేదు;ఉదయం ఊడిపడలేదు-ఆసంధిసమయంలోఆమెకంఠం జీరబోయి, మాటలు వెదకలేక, తపనతో సంగీతంగా మారే సమయాన అతని శరీరంలో రక్తపుపోటు గానంగాలేచి భూమ్యాకాశాలను ఏకంచేసి, పగటినీ చీకటిని బంధించి, వెనకనీ ముందునీ ఐక్యంచేసి, జన్మ రాహిత్యంలో అంత మొందుతుంది.

అలివేలు దీపం కాస్తపెద్దదిచేసి ఆరుబైటకెళ్ళి రమ్ములో నీళ్ళతో మొహం కడుక్కుంది. లోపలికొచ్చి మంచం మీది తువ్వాలుతో తుడుచుకుంది. ప్రభాకరం పడుకునేవున్నాడు. వక్షంబరువంతా అతని నుదిటిమీద పడేలాగువాలి, వేళ్ళతో అతని జుట్టుని నిమురుతోంది.

"ఇంక వెళ్ళేదా?"

అతను లేచాడు. పైనతువ్వాలేసుగున్నాడు బల్లమీద గడియారం నాలుగున్నర చూపుతోంది. పాడై, గట్టున పడేసిన, పడవలు, బల్లకట్లు పోగుచేసి, వాటికర్రలతో స్వంతంగా తయారుచేసుగున్న గుడారం అతని ఇల్లు. బయట వరండాలో కుర్రాడు "కరీమ్" ఇంకా నిద్రలోనేవున్నాడు. అతన్నిలేపకుండా, మెల్లగా ఇద్దరూ బయటకి నడిచారు అక్కడికి కాలవ గట్టు ఫర్లాంగుదూరంలో వుంది. అంతటా దట్టంగా ఎదిగినగడ్డి, మొక్కలు, తుప్పలు——మధ్యన ఇసుగతో పరిచిన సన్నటిదారి. ఆకాశంలో తారకలు స్ఫుటంగా మెరుస్తున్నాయి....జడలో అక్కడక్కడ అమిర్చిన మల్లె పూలపై కాగడా వేసినట్లు, తూర్పున తెల్లబోయినట్లు, వెలుగు తన ముసుగుని తొలిగించేందుకు తగిన ఓపిక తెచ్చుగుంటోంది. దూరంగా సర్వీచెట్లు పెనవేసుగుని పవ్వళించినట్లు నిశ్చలంగా వున్నాయి. నిద్రిస్తున్న ప్రకృతి నడుమ కొట్టుగుంటున్న నరాలకి మల్లెనడిచి, కాలవగట్టుకి చేరుకున్నారు. కాస్తదూరంలో పనివాళ్ళ పాకలు, ఆవలివొడ్డున చెట్లు, పొదలు, తెల్లటి పొర వెనక, దోమతెర వెనక దృశ్యంలా, పాతబడిన నీటివర్ణచిత్రంలా నిలిచిపోయ్యాయి. కాలవ ఇంకా ముసుగుతియ్యలేదు. వరదలకి పెగిన గుట్లసందుల్లోకి చోటుచేసుకుని అవులించి మళ్ళా ముసుగు బిగిస్తోంది. ఒడ్డున పాతిన ఇనపకడ్డీకి కట్టేసిన తాడు విప్పి, ఇద్దరూ పడవలోకెక్కారు. అది ప్రభాకరం తయారుచేసిన కొత్తరకపు కర్రపడవ. ఆమాదిరిది దామోదర్ లోయలో చూశాడు. దానినడుమ సైకిల్ కిమల్లె కాళ్ళతో తొక్కే పెడల్సు వుంటాయి. పడవ ఇరుప్రక్కలా రెండు చక్రాలుంటాయి. పెడల్స్ తొక్కితే, చక్రాలు తిరిగి పడవ ముందుకు సాగుతోంది. అలివేలు ఎదురుగా కూర్చుంది. అతను పెడల్ తొక్కుతున్నాడు. "ఏమిటీదంతా.... ఇంకా తెల్లారకుండా?" అన్నట్లు కాలవలేచి, ముసుగులోంచి తొంగిచూసి,

చోటిచ్చి, వెనక దిగడిపోయింది. ఫర్లాంగు వెళ్లాక, కుడివైపుకి నడిచి, అవలిగట్టున నిల్చింది పడవ. అలివేలు గట్టునదిగింది.

"మరి ఉండేదా?"

జేబులోంచి రూపాయినోటుతీసి ఆమెకిచ్చాడు.

"ఎందుకు?"

"సంగీతం మేష్టరు కివ్వు."

ఆమె నవ్వింది. గట్టున నీళ్ళలో అస్పష్టమైన ఆమె ప్రతిమ వంకరగా నవ్వుతోంది. నోటు తీసుగుంది. వెడుతోంది.

"భయం లేదుగా?"

ఆమె వెనక్కి తిరగలేదు. పడవ వెనక్కి మళ్ళించి, తన గుడారం దగ్గరకి చేరుకున్నాడు ప్రభాకరం.

తూర్పున చీకటి కనురెప్పలు కదులుతున్నాయి. రెండు మూడు పిట్టలులేచి చోద్యము చూసి చెట్లనడుమ మాయమయ్యాయి. శుభ్రం చేసుంటే మెఱిసే అద్దమల్లే వుంది కాలువ. పిల్లగాలికోసం బెంగెట్టుకున్న గడ్డి కదుల్తోంది. పళ్ళు తోముకునే పరికరాలు తెచ్చాడు కరీమ్. ఆ పని కావిచ్చి, చొక్కా తీసి కాలవలోకి దిగాడు ప్రభాకరం.

పాదాలకింద గులకరాళ్ళు నడుమ బురదలో చిక్కుకున్న ఇసుక, రాత్రంతా దాగిన కాలవ నీటిలో చలి వొళ్ళక్కసారిగా తన శరీరాన్ని ఆవహించింది. నిత్యమూ అతను ఎరుగున్న అపూర్వ అనుభవం అది. ప్రకృతితో అతని బంధం. ఆమె వక్షం వొంపులమధ్య మసిలే మెత్తటి వేడిలో పదును పతామర్శించడానికే కాలవ అంతటి చలిని దాచుకుంటుంది; శరీరంలో ప్రతి అణువునూ శోధించి, కడిగి, శుభ్రంచేసి, జీవంపోస్తుంది. సౌందర్యం సాక్షాత్కారానికి అతను సిద్ధం.

తూర్పు కోడై కూసింది. పుంజు నుదుటిని ఎఱ్ఱకిరీటమల్లె తూర్పున ఎఱ్ఱవెలుగు లేస్తోంది.

ఆకులనడుమ వెలుగుకెంపులు మెరుస్తున్నాయి. పిల్లమేఘం, కత్తివోటుకి గాయపడి రక్తం చిమ్ముతూ పరుగెడుతోంది. దూరంగా నాగ

స్వరవాద్యం.... పుట్టలో మెదిలే నాగుబాబు పిల్లలల్లె కాలవలో పిల్ల తరంగాలవి మేలుకొల్పుతోంది.

o o o o

కాలవవతల ఊళ్ళో భరతరాజుగారి ఇంటిముందు వేసిన పందిట్లోంచి వొస్తూవుంది ఆ నాగస్వర వాద్యం. భరతరాజుగారి షష్టిపూర్తి జరుపుతున్నారు ఊళ్ళో పెద్దలు. అందుకూ సన్నాయిమేళం. కార్యక్రమానికి ఆధిపత్యం వహించింది పెద్దెయ్య. పెద్దెయ్య నిజంగా పెద్దెయ్య. కోస్తా ప్రాంతాలు సస్యశ్యామలమైన ప్రాంతాలనడానికి ఆయన తార్కాణం, లావు తగ్గ ఎత్తు కేవలం లావుని చూసి ఈయన చేతుల్లో ఈ కార్యభారం వుంచడానికి కొందరు సందేహించినా, ఎత్తు ప్రశంస రావడంతో ఆ వ్యతిరేకులు నోళ్ళుకట్టడ్డాయి. అద్భుతమైన కోరమీసం, ఈ శతాబ్దిలో.... మందంలో, నలుపులో, మేళవింపులో, ఠంజాయింపులో.... దీన్నిమించిన మీసం లేదేమో నన్నారు జనం. మోతుబరి ఆసామి. ఇంకేం కావాలి? ఆ ఊళ్ళో ఉత్సవాల నిర్వాహకచక్రవర్తిగా వుండటం తప్పిందిగాదు పెద్దెయ్యకి. ఈ ఉదయం చాలా ఉషారుగా ఉన్నాడాయన నవ్వు....మీసం వెనక కనబడకపోయినా.... వినబడుతోంది. పందిట్లో చోద్యం చూడ్డానికి పోగైన పిల్లల్ని బుజాలమీద ఎక్కించుకుని, దించి, ఆట్లాడుతూ ఉత్సాహంగా ఉన్నాడు.

అన్నీ అనుకున్నట్లు సక్రమంగా సమకూరుతున్నాయి. భరతరాజు ఆయనకి ప్రాణమిత్రుడు; బహుయోగ్యుడు; మహా మంచివాడు; అరవై నిండాయి ఊళ్ళోవారికి అయనపట్లవున్న గౌరవం, స్నేహభావం, పూజ్యభావం చూపడానికే యీ కార్యక్రమం తలబెట్టింది. ఆసించినంతా కాకపోయినా, చాలాభాగం విరాళాలు పోగైనాయి. భరతరాజుకి ఆరువేల రొక్కం ఇస్తున్నారు. అధ్యక్షుడుగా రావడానికి, తానుకోరిన ప్రముఖ వ్యక్తి అంగీకరించాడు. ఎటొచ్చీ, వేరే పనులవల్ల సాయంత్రం నాలుగిం

టికే వెళ్ళిపోతానన్నాడు. బహిరంగసభ నాలుగింటికి ముగిస్తుంది. కవులు ప్రశంసాపత్రాలు సమర్పిస్తున్నారు. వారి కివ్వవలసిన శాలువలు క్రితం రాత్రికే వొచ్చేశాయి.

రంగనాథ్ గీస్తున్న భరతరాజు తైలవర్ణ చిత్రం పూర్తయింది. రంగులు ఆరుతున్నాయి. సాయంత్రం ఊరేగింపు. అలంకరించిన బండిని, అరబ్బై ఎడ్లు లాగుతాయి, ముందు, వెనక బాణసంచా.... అవునవును, ముందు వొద్దన్నారు.... ఎడ్లు బెదురుతాయేమో....పోనీ వెనక, లేకపోతే మరీ ముందుగా.... అయినా తన కెందుకు .... బాణసంచా గొడవంతా బంగార్రాజు చూచుకుంటాడు.... రాత్రి హరికథ. పై ఊర్నించి పత్రిక లవాళ్ళు వొస్తున్నారు. ఫోటోలు తీసి పేపర్లలొవేస్తారు. మంత్రాలు చదువు తున్నారు. అన్నింటికన్నా ముఖ్యం అనేక చోట్లనుంచి పెద్దలు శుభ కాంక్షలు, ఆశీస్సులు పంపించారు. బహిరంగసభలో తాను చదవాలి.... దాంతగలెయ్యా, కొన్ని ఇంగ్లీషులో వున్నాయి మునసబుగారి తమ్ముడు .... ఆ ప్లీడరీ చదువుతున్నాడే.... ముత్యాలు.... అతన్ని చదవమనాలి ఇంగ్లీషుత్తరాలు, ఇంటికెళ్ళి అద్దంముందు నిలబడి.... అది చూడకుండా— చూస్తే నవ్వుతుంది.... ఉత్తరాలు చదవటం రిహార్సల్ వేసుగోవాలి. పూలదండలు సిద్ధమైనట్లేనా? ఆహా వక్కా? విస్తళ్ళ? పాలకావెళ్ళ? నడుంమీద ఎక్కిన కుర్రాణ్ణి దించివేసి లోపలికి నడిచాడు. అన్నీ బాగానే వున్నాయి.... ముత్యాలుకి కబురెట్టాలి! వొంటెన విషయం ప్రభాకరంతో మాట్లాడాలి.... డోలు జోరుగా మోగుతోంది.

o o o

మునసబుగారి తమ్ముడు ముత్యాలరావు, కారమ్స్ ఆడుతున్నాడు, పైజామా, చేతులు మడిచిన షర్టు, ఎగదువ్వ క్రాపింగ్ .... పాతికలోపు. ఎదురుగా పక్కింటి తిరుపతి కారమ్స్‌బల్ల చిగుళ్ళకుండే సంచీలు వూడితే, జేబురూమాలు సంచీగా బిగిస్తున్నాడు బాణసంచా బంగార్రాజు ప్రవేశించాడు. సన్నటి మీసం, మాసినకోటు, సైకిల్‌కట్టు పంచి, పాగా, చేతిలో కర్ర; బంగార్రాజు.... సిసింద్రీలాంటి వాడన్న ప్రతీతి. ఆ ఉపమానం అతనికిష్టంలేదు; ఇంకా "తారాజువ్వ" అనండి సంతోషిస్తా

నంటాడు. నలభయ్యో పడిలో పడ్డాను గనుక, తారాజువ్వలో తార తీసేసి, వొట్టి "జువ్వ" అన్నా అతని కభ్యంతరం లేదు.

"ఇయ్యన్నీ మీరు చదవాలంట— మద్దాన్నం మీటింగులో" అని శుభాకాంక్షలకట్ట ముత్యాలు ముందు పడేశాడు

"విన్నా. అన్నా చెప్పాడు. ఇంగ్లీషు మాటల్ని తెలుగులో రాసిస్తాను పెద్దయ్యనే చదవమను" అన్నాడు.

"ఇంకా నయం— తెలుగుని చదవడమే ఆయనకు గండంగా ఉంది. తల్పుకు తిమింగలంమల్లే నవ్వుతుంటె, ఓ రబ్బా, పొట్ట గుమ్మడికాయల్లె ఊగిసలాడుతుందే, ఇంక ఇంగ్లీషు చదివితే పందిట్లోవాళ్ళ పొట్టలు చెక్కలైతే— ఇంక రాతిరికి ఆ చెక్కలు తరిగి కూరొండాల్సిందే...."

"ఇంతకీ ఈ భరతరాజు ఏం ఘనకార్యం చేశాడనీ ఈ సభలూ, సన్మానమూ?— పదివేలదాకా పోగుచేశారుట!"

"అ డవుటు నా గొంతులోనూ ఆడుద్ది. ఏది చేసినా చెయ్యకపోయినా, భరతరాజు అకవై దాటేశాడు, అదే శాన అనుకుని, మాట మింగేసి సై నారాజా అని టపాస్ తయార్ చేశాను పెద్దోడు, మంచోడు, ఓరి జోలికి పోడు. తలలు మార్చి తలలెట్టడు. కల్లకపటం లేదు; తిన్నింటి వాసం లెక్కెట్టడు; ఓరిసొత్తు ముట్టడు; దొంగయాపారం చెయ్యడు; లంచం ఇయ్యడు; పుచ్చుగోడు. తనపని తను చేసుగుని, కడుపులో చల్ల కదలకుండా, అరుగుమీద పండుకుని హాయిగా చుట్ట కాలుస్తాడు; ఏదో దేముడనీ, దెయ్యమనీ, పూజనీ, పురస్కారమనీ, పండగనీ, పబ్బమనీ చేసుగుంటా, నలుగురితో నారాయణా అంటాడు. ఇది సాలదుటండీ?"

"బాగుంది బంగార్రాజూ— మంచిగుణాల చిట్టా వొకటి తయారు చేశావ్. కాని ఇందులో ఆయన చెయ్యని పనులే వున్నాయి కాని చేసిన మంచిపనులు "ఫలానా" అంటూ ఏమీ కనబడలేదు నాకు; చెప్పొద్దూ!"

చాక్‌పౌడర్ దులపడం నిలిపి తిరుపతి అందుకున్నాడు

"అసలు విషయం ఒదిలేశాడు బంగార్రాజు "

"ఈ చెవిని పడెయ్యి."

"అందరూ చెప్పుగుంటున్న దేస్మాండి.... నాకు మాత్రం ఏం

తెలుసు. భరతరాజు ఏకపత్నీవ్రతుడు! పరస్త్రీని కన్నెత్తి చూడడుట. ఆదొక్కటే చాలు బ్రహ్మరథం పట్టడానికంటున్నారు."

బంగార్రాజు ఆహ్లాదం కనబరుస్తూ అందుకున్నాడు; పాగా తీసి, జుట్టు సవరించుకుంటూ,

"అద్దిగదీ.... నాడి పట్టేశావయ్యా చిన్నోడివైనా. అది గొప్ప విషయం...."

"అంటే ఆయన బ్రహ్మచారికాడుగా.... బోలెడుమంది సంతానం" అని పూర్తిచెయ్యడం చేతగాక విడిచేశాడు ముత్యాలు.

"ఆళ్ళంతా ఆయన సొంతపిల్లలే" అన్నాడు బంగార్రాజు. తిరుపతి నవ్వుతున్నాడు, బంగార్రాజుకి కోపం వొచ్చింది.

"ఎందుకయ్యా ఎగతాళి? ఉంకొకమ్మతో పరాసికాలు, సైయ్యాట్లు, సందుగొందు యవ్వారం జరపకుండా, కట్టుకున్న అరవైయ్యేళ్ళు పడున్న మరొక మొగాణ్ణి ఈ ఊళ్ళోనే కాదు, ఓల్ మొత్తం దేశంలో సూపవయ్యా సూసి నీ సినిమా నవ్వు నవ్వుదువుగానిలే" అన్నాడు ఉద్రేకంతో.

"ఈ సన్మానం ఒద్దనడం లేదు. ఆయకిది జరగడం నా కిష్టమే. అసలే తెలుగుదేశంలో ఒకరంటే ఒకరికి పడిచావదు. ఆ పరిస్థితిలో ఇంత మందికి ఈయనంటే పడిందంటే విశేషమే ప్రేమనీ గౌరవాన్నీ ప్రకటించాల్సిందే.... ఇట్లా తరుచు జరుగుతూ వుంటే తెలుగువారు పురోగమిస్తున్నట్లే భావించాలి. ఎటొచ్చీ, ఏ కారణంగా ఈయనకి ఈ మర్యాద జరుగుతోందీ అన్న కుతూహలంవల్ల అడుగుతున్నాను."

బంగార్రాజు కోపం దిగమించుకుని తమాయించుకున్నాడు.

"ఇప్పుడు చెప్పాను గదటండీ. మంచాయన, దేవుడంటోడు...."

"దాన్ని కాదనడంలేదు. ఆయన మంచివాడే.... కాని ఏమీ చెయ్యక పోవడంలోనే కనబడుతోందిగాని సంఘానికి— అంటే నలుగురికి.... ఉపకారం జరిగే మంచికార్యం ఆయన చేసినట్లు నువ్వు చెప్పలేదు. ఆలి కన్నం పెట్టడం ఊరికుపకారమా అన్నట్లు ఆయన మంచితనంవల్ల, ఇతరులకు జరిగిన మంచి ఏమిటీ అని అడుగుతుంట."

"నాకు తెల్దండి, మీతో ఏం చెప్పాలో. ఎవళ్ళకీ ఎసరెట్టకపోవడమే

లావండి. సందుగొందు యవ్వారముంటే, అమ్మల కాపురాలు కూలవం టండీ.... అదుగో ఆ వొంతెన కట్టించే ప్రభాకరం చేస్తున్న పనే అదిగా"

"అంటే?"

"మీరు బస్తీలో చదువు కెడతారుగాన తెలీదేమో- ఆ ప్రభాకరం, సినమ్మకూతురు అలిమెల్నితగులుకున్నాడుగా! అదికేం పొయ్యేకాలం? ఇంటిగాడ పెళ్ళాముంది, ఇద్దరు పిల్లలంట.... దీనితో సైయ్యాట్లు; రాత్రుళ్ళు ఆయన గుడారంలోనేనంట మకాం, పనివాళ్ళకందరికి తెలుసు. దానమ్మ మద్దత్తు— అయ్య నీళ్ళలోపడి ప్రమాదం జరిగి చచ్చాడు. ఇంక దానికి స్వేచ్ఛ, చందాలు పోగుచేపించి, సినమ్మకి ముట్టజెప్పడం.... వూరికే ననుకుంటిరా.... కాదు. కూతురుతో మజా...."

"అలిమేలు భర్త ఎప్పుడో చనిపొయ్యాడు. ఆమె విడో. అతనూ వొంటిగా వున్నాడు— ఏం మహతప్పు?" అన్నాడు తిరుపతి.

చాలైగవయ్యా తిరుపతి. ఈ కాలపోళ్ళు ఇంగ్లీషు చదువులు చదువు కుని ఇట్టతయ్యారయ్యారు. ఏంమహతప్పంట.... తీర్పుసెయ్యనొచ్చాడు. తిరపతయ్య. వెధవదాన్ని పట్టుగు దేవుళ్ళాడటం, మరీ తప్పుకాదం టయ్యా?"

"మరొకరికొంప తీయడం తప్పంటే అన్నాను. అలిమేలికి భర్త లేడుగావున, ఆమెకొంప తీసే చెడ్డపని చెయ్యలేదు ప్రభాకరం అనబోతు న్నాను." అన్నాడు తిరపతి కారమ్స్ బిళ్ళలు పెట్టిలో పడేసి, గోడకి జేర వేస్తూ.

"ఇంక నేను చెప్పేదేముంది. ఈఊళ్ళో మరికొన్ని రోజులున్నా డంటే, ప్రభాకరం ఇంకెందర్ని-మరిగి ఎందరి కొంపలుతీస్తాడో—తన్ని సాగనంపాలి ఇట్లాంటివాళ్ళని! మన ఊళ్ళో పెద్దలంతా ముండమొయ్యా లేదులె. జరగవల్సిన తంతు జరగనేజరిగింది ప్రభాకరం ఉద్యోగం పీక డం వల్లనవకపోతే, రేపోమాపో బిచాణాఎత్తేసి ట్రాన్సఫరై లగెత్తుండా డుగా. పెద్దలు పూనుకున్నారు నీకు తెలవదేమో." అన్నాడు బంగారాజు.

"భరతరాజు షష్టిపూర్తి, ప్రభాకరం గెంటివేత మహోత్సవం రెండూ ఒకేరోజు జరగడంలేదు—కాస్తంత నయం. మంచిపనులు చేసి

నందుకు ప్రభాకరంకి మంచిశాస్తే జరుగుతోంది చెరువుగట్లు బాగుచేయించి, చుట్టూ రాళ్ళుపరిపించి మొక్కలుపాతి శుభ్రంచేశాడుట: ఊళ్ళో నాలుగైదు చోట్ల మురుగుని కప్పివేసే సదుపాయాలు చేశాట్ట; సాయంత్రం నలుగురి పిల్లల్ని పోగుచేసి ఊరికే చదువు చెప్తాడుట; కాలవ మీద వొంతెన కట్టడం సకాలంలో పూర్తి కావిచ్చాడుట, పారేసిన కలపతో గదులు కట్టించాడుట. అలిమేలుకి సంగీతం నేర్పిస్తున్నాడుట. తానొచ్చింది వొంతెన కట్టడానికైనా, ఊళ్ళో చందాలుపోగుచేసి, తాను స్వయంగా చేస్తున్న మంచి పనులు ఇవన్నీ!" అని వేళ్ళు ముడిచి లెక్కపెడుతూ యాకరువు పెడుతున్నాడు ముత్యాలు.

"అవును, అలివేలుకి ఏ పిల్లాడోపుడితే, తాను విడిచివేస్తే, కచ్చేరీలు చేసి పొట్టపోసుకోవాల్సింది, లే.... లెగండి చెప్తారు. పైపెచ్చు, ఇయ్యాళ సాయంత్రం వూరేగింపు, వొంతినమీదనుంచి వెళ్ళడానికి వీల్లేదంటున్నాడుట ప్రభాకరం—వొంతిన ఆయన సొంతమైనట్లు. ఎందుకు వీలుకాదో చూద్దాం."

అని పాగా సర్దుకుని, కోటు మడతలు సరిజేసుకుని, కఱ్ఱని చేతిలో తీసుకుని, బైటకి నడుస్తున్నాడు బంగార్రాజు.

o o o

లక్ష్మమ్మ చెరువుగట్టుకొచ్చింది నీళ్ళకోసం. చెరువులో నీళ్ళు నిర్మలంగా వున్నాయి—సన్నగాలికి నీటిమీద కెరటాలు, తాతమ్మ నవ్వితే నోటి పక్కన తేలినమడతలల్లే,రాళ్ళమీద చప్పుడు లేకుండా విడిపోతున్నాయి. లక్ష్మమ్మ నిన్ననే వూర్నుంచి వొచ్చింది—మూడునెలల తర్వాత. చెరువు వైఖరే మారిపోయింది ఇదివరలో, దాన్నిండా ఆకులలమూ తుక్కుదూగరా వుండేవి. ఇప్పుడు గట్లు శుభ్రంగావున్నాయి. రేవు మెట్లు, చుట్టూ ఇసక, ఎర్రరాళ్ళు, పొడుగునా వేసిన తీగలు—అంతా కొత్తగా వుంది. జనంకూడా పల్చపడ్డారు. అమ్మలక్కలు పిల్లల్ని తెచ్చి, గట్లుపాడుచేసి. స్నానాలుచెయ్యటంలేదు. స్నానాలు చేస్తుంటే, చూడ్డానికొచ్చే మొగపురుగులు కనబడరేం? ఏమిటో దిగులుగావుంది. అందంగా వుంది నిజమే.

కావి అదొతలాగుంది. ఆ వెనకటి గజిబిజి, అల్లరి, సందడి—అదే బాగుం దేమో!

అమ్మయ్య. అదుగో, అ(వొచ్చింది కామాక్షి. పురుషోత్తం గార మ్మాయి—స్నేహితురాలు. ఆ ముక్కు అంత పొడుగు లేకుంటే, అంద మైన మొహమే. జబ్బో! మెడలో కొత్తగొలుసల్లెవుందె! మోచేతిదాకా రంగురంగుల గాజులు!

"ఎప్పుడొచ్చా."

"విన్నతాలె గొలుసు చేయిస్తిరా?"

"పాతదె. చెరిపించి....ముసిలా డుండాడా?"

"ఏ ముసిలాడు?"

"సెర్లో స్నానమాడకండా, వోణ్ణి కాపలా కూకండబెడతారులె!" నాలుగు పక్కలా చూసింది లక్ష్మమ్మ. ఏ మనిషి లేడు.

"సల్లగా బాగుంది. సూర్యు డెక్కపొడుస్తుండాడు. కాలవకాడికి పోలేను. ఇంటికాడ సుట్టాలు. దిగుతా," అంటూ చీరబిగించి, గోచిలాగి, జడ మెలితిప్పి మెడవెనక బిగించి, మెట్లు ిగి; నీళ్ళలోకి ప్రవేశించింది కామాక్షి.

"నేకూడా వొచ్చేదా?" అంది లక్ష్మమ్మ.

"మొహాన్ని కొట్టిన పౌడరు రేగిపోతుందని భయమా?" అటుఇటు చూసి తనూ దిగింది లక్ష్మమ్మ.

బిందులోన వుందిలె తు ్డు. దిగు. ఇటురా, భయం లేదులె."

నీళ్ళు వెచ్చగా, చల్లగా, బట్టలు తీసేసినట్లూ, మళ్ళా తొడిగినట్లు, చర్మాన్ని కమ్ముతున్నాయి. చేపపిల్లలు మూగి చోద్యం చూసి మళ్ళా తొలి గిపోతున్నాయి. కామాక్షి నిలబడి రెవిక సర్దుకుంటోంది. జుట్టులో ఇరు క్కున్న నగని తోస్తోంది. తడి వెనక పల్లంలో నల్లగావుంది. రొమ్ముల లేచినచోటు, రెవిక రంగుబిగిసి బట్టమైంది అటు ఇటు చూసింది తనవి చూడ్డానికెవ్వరూలేరు మళ్ళా నీళ్ళలోకి దిగికూర్చుంది. చీరమడతలు నీటి మీద చుట్టూ కమ్ముతున్నాయి—లోపలికి తోస్తోంది.

"చెరువంతా మారిపోయిందే?" అంది లక్ష్మమ్మ.

"అదుగో ఆ ప్రభాకరం వనంట ఇదంతా, నీళ్ళు తాగడానికేనంట. స్నానాలు కూడదంట.

"మరి మనం ఇట్లా చెయ్యడం మంచిదా?"

"ఒక్కపాలేగా, కాపలా తాత లేడుగనుక!"

"ఆయన అలివేల్ని పెట్టుకున్నాడంట."

"అప్పుడే నీకూ తెల్సింది-దానికి సంగీతం నేర్పిస్తున్నాడంట ముండ మోసిన దానికి సంగీతమేందో!"

"ముండమోస్తే పాడకూడదా ఏంది? అళ్ళమ్మ మద్దత్తే నంట."

"మొగుడు కాలవలో పడిచచ్చాడు, అళ్ళనీ ఈళ్ళనీ అడిగి చందాలు పోగుచేసి, పెళ్ళానికి డబ్బిప్పించాడు. కూతుర్ని పెట్టుకున్నాడు క్రాపింగూ తనూ. అయ్య బాగుంటాడులె— అలిమేలు కోతనుకో.... ఎర్రకోతి, ఇంక సాగవులె అట్లు."

"ఏం?"

"ఏర్రి ఏసా లేస్తుంటె సాగుతయ్యా? బదలీ సేపిస్తుండారుగా!"

"అయ్యో పాపం!" అంది లక్ష్మమ్మ.

"ఏం కథ, అట్టట్టపోతుండాదా మనస్సు— సినిమాలో పిల్లకి మల్లె."

"చీ పో. అలిమేలు విషయం.... ఆయన వెడితే, దాని కెల్లా?"

"మరోడు — కొత్తాయన — ఈనకి బదులు వొస్తాడుగా."

"ఛీ, పో. నీయన్నీ పోకిరీ కబుర్లు."

"ఎట్టమరి. పడుసుతనంలో మరిగిందాయె. ఇంటికాడ కెడతంకి కూడదాయె. ప్రభాకరంకి పెళ్ళాముంది, మక్క లిరగేస్తుంది. లేకుంటె ఒంతినకింద, ఈలుసిక్క వొచ్చినప్పుడల్లా చీకట్లో కులకాలె," అని నవ్వ తోంది కామాక్షి.

"ఒంతినేంది?"

"ఈన వొంతో నోలెకట్టించాడులె. అక్కడే కలుసుకుంటారంట"

"రహస్యం డనికో. తల్లి మద్దతే నంటివిగా."

"ఇస్, మెల్లగా దుర్గొస్తోంది. కాపలావుంటాడే ముసిలాడు, ఆడి మనమరాలు."

దుర్గ మెట్లుమీద బిందెదింపి; ఓణీ సర్దుకుంటోంది. వయస్సు పదహారు. పదిహేడు, నలుపు, పెద్దకళ్ళు, వొంకిల జడ. గుండ్రని భుజాల మీదనుంచి ఒరిగింది, ఊపిరి తీసినప్పుడల్లా, ఆయాసంపడిన దానికిమల్లె, వక్షంలేచి పడటం కనబడుతూ వుంటుంది. బుజంకింద, గుండ్రటి చెమట దాగు జాకెట్టు మడతలో పచ్చగా కనబడుతోంది.

"మీరు స్నానానికి దిగినారే కామాక్షమ్మగారు.... నీళ్ళు వెడిపోవు టండీ" అంది దుర్గ.

"ఏడిశావులే. తాత నిన్ను కాపలా పెట్టినాడా?"

"తాత భరతరాజాగారి లోగిలికెళ్ళాడు, ఎయ్యి పన్లు చెప్పారు. మీకు మేం చెప్పా లేఁటండీ— మీకే తెలియాల."

"నోరు ముయ్యవే భడవా. మా ఇష్టం మేం చేస్తాం. నీకెందుకు?"

"ఊళ్ళోవోరి పెరువు, శుభ్రంగా ఉంటె మీకేమంచిది. ఆ చీర మురికంతా మీరే తాగేది" అంది దుర్గ.

"ఛప్ నోరు ముయ్, ఈ చీర మురికిదా— రెండు రోజులన్నా కాలేదు."

నీళ్ళలోంచి లేచి పైన మెట్లుమీదకొచ్చింది కామాక్షి. లక్ష్మమ్మ కూడా వొచ్చి బట్టల్ని విడిచి, ఒళ్ళు తుడుచుకుంటోంది. దుర్గ నవ్వుతోంది.

"చూపేదానికి ఎవ్వరూ లేరు. అందుకనే చప్పున ఒచ్చేశారు నీళ్ళ లోంచి" అంది దుర్గ.

"ఏమిటి నీ కబుర్లు. ఏం ఆ ప్రభాకరాన్ని మరిగావా నువ్వు కూడా—" అని మీదికెళ్ళి దుర్గ చంపమీద కొట్టింది కామాక్షి.

ఆమె ఏడుస్తూ మెట్లుమీద చతికిలబడి, తలని మోకాలుమీద ఆనించింది. ఇంతలో నలుగు రైదుగురు మొగాళ్ళు ఒచ్చారు. కాపలా తాత ఒచ్చాడు. దుర్గని లేవదీశాడు.

"చెర్లో స్నానాలొద్దంటే కొట్టింది" అని ఏడుస్తూ చెప్తోంది దుర్గ.

"ఫరవాలేదులేవే యీ ఒక్కపూట. ఊర్నందరినీ కూడా ఇక్కడ స్నానాలు చేపించడానికి పంపితే తీసుకొచ్చా. భరతరాజుగారింట్లో కార్యం చూడ్డానికొచ్చిన చుట్టాలు లేవే—" అని బుజ్జగించాడు. దుర్గకళ్ళు తుడుచుకొని బిందెతో నీళ్ళు తీసుకుంది.

"ఇంకెప్పుడూ ఇల్లాంటివి పేలమోక. బుద్ధి తెచ్చుకో" అని కసిరింది కామాక్షి.

"ఈ మొగారికే అది లేకుంటే ఆడాళ్ళ కెట్టొస్తుంది లెండి" అని నడుచుకుంటూ వెళ్ళింది దుర్గ.

"సిన్నతనం. నే క్షమాపణ చెప్పుకుంటా. దణ్ణాలెడతా. ఈసారి చేసినా, మరెప్పుడూ స్నానాలకి రామాకండి" అంటున్నాడు తాత.

○ ○ ○

భరతరాజుగారింటి పందిట్లో సన్నాయి విల్చిపోయింది. మంత్రాలు చదువుతున్నారు, ఊళ్ళో జనం అరుగులమీద కూర్చున్నారు, దూడలకాసే పిల్లలు, గడ్డికోసే అమ్మాయిలు, పందిరి కంతల్లోంచి పడే ఎండలో నల్లగా అలయంలో బొమ్మలల్లె— తైలంపోసిన బొమ్మలల్లె, చమటలతో మెరుస్తున్నారు. భరతరాజుగారి జుట్టంతా వూడిపోయింది, ప్రక్కన భార్య తలలో మిగిలినవన్నీ తెల్ల వెంట్రుకలే. రెండుమూడు పళ్ళు మిగిలాయి. పట్టుచీరంతా కర్పూరం పరిమళం— చిన్నప్పుడు పొలం గట్టున చెట్టునీడలో ఆ పిల్లల్లె, గోటిబిళ్ళ ఆడుకునేవాడు. ఎండిన తాటికాయల మధ్య కర్ర బిగించి, తాడుకట్టి లాక్కుని వెళ్ళేవాడు. కాలవలో స్నానం, బురద నీళ్ళు, వొడ్డున కప్పలు, జలగ పీకుతుంటె, గంటవరకూ గమనించలేదు, స్తంభంపై పిగిలిపిట్ట— రెండుతోకల నల్లపిట్ట, పచ్చటి పాలపిట్ట గడ్డిపోచల నడుమ సీతాకోకచిలుకలు— వొంటిరెక్క పురుగు వొంకరగా ఎగురుతూ పూలమీద వాలేది, లేగదూడ వంకరగా నడుస్తూ పడిపొయ్యేది. చెరువులో గేదెల స్నానం. రాత్రిఅప్పడాలు, ఆవకాయ, అరిసెలు, సున్ని, తేగలు, రైలు పొగ చూడగానే అందరూ పట్టాల దగ్గరకు పరుగు లెత్త

గాలు-ఇంజన్ ముందు నిలబడ్డం, తెల్లగా ఆవిరి చీదేది-బాబో అవి పరుగులు; బొగ్గు వాసన, వేడి నీళ్ళు, ఎర్రజెండా; నూనెకాగడా—తోలుగొలుసు తాళం—కామయ్య రావిచెట్టు కింద చాకలిసూరి తగువు తీర్చడం; మొగుడు రంగం వెళ్ళాడుట—తాను సెట్టివి మరిగింది—పదలం చింతపండు జరిమానా—తూర్పు రేవులో బట్టలుతకడంకి వొల్లకాదన్నారు; రాత్రి సంబరం, గరగలతో పూనకం, త్రోపుళ్ళు, పున్నమ్మ పూనకము సంబరం, ఊరేగింపు, ఆకుల తోరణాలు, కాగడాల వెనక సూరమ్మ వెనక కుర్రకారు తోపుళ్ళు, తోసుకుని వెనకాల జార్లపడితే, ఓలయ్య స్తనాల తాకిళ్ళు—"పాడుపిల్లడు" అని వినబడకుండా తొయ్యడం—చేతులు అయ్య బుజానికి తగిల్తే, అందుకే సంబడాలు, రాత్రంతా ఊరేగింపు, డివ్వి, డివ్వి చువ్వలతో తోలుడప్పులు వాయింపు—వేసంగి ఎండలో అరుగుముందు మూర్ఛవొచ్చి ఆ ముసిలాడుపడితే బిందెలతో నీళ్ళు పొయ్యాలి—తల ఆడించి, కొట్టుగువి లెగుస్తాడు- వాడి మెడలో డబ్బా రేకు; వీధి బరి, చింతజెత్తం చెళ్ళుమంటుంది, అయ్యవోరికి పప్పుబెల్లాలు, బాణం దెబ్బలు, గోడ కుర్చీలు, పాలిగూడుని కెలకటం, గుడికాడ తొర్రలో తేలు-అమ్మో శాస్త్రిలు మంత్రం, పిలకాడుతావుంటే, అంగవస్త్రం—పలసటిది....నడుంకింద మొలతాడుతో బిగించి, నూతికాడ రెండు చెంబుల నీళ్ళకి, పల్చటి బట్టలోంచి అన్నీ కనబడతయ్యి; కుంపెద్దునాగలి లాగదు; నీళ్ళవి - వేసంగికి కాలవలు కట్టేస్తే, అంతా ఇసక, అమ్మలక్కలు నూతులు తవ్వి నీటికి దేవుల్లాడతాలు.

వెంకన్న కావిడితో నీళ్ళు తెస్తే—సలివేంద్రం తోలు బొమ్మలు-ఊరవతల ఎన్నెల్లో, గబ్బిలాలు నిద్రపోతుంటే, హరిహరి నారాయణో అంటూ గొల్లసుద్దులు—కళ్ళంట నీళ్ళు గిర్రున తిరుగుతై—రావణాసురుడి ఇంటికాడ సీతమ్మ ఏడుపు; అడివిలో హాలోలక్ష్మణా అంటూ ఏడుపు గుండె తరుక్కుపోతుంది—ఆనకట్ట కడుతుండారు-వైర్లు, లాకులు, నీళ్ళు పైకి లేపడం, కిందికిదిగడం. చేపలోళ్ళ పడవలు లాకుల నడుమ చిక్కుకుంటె, సూపరెంటుగారికి అరిటిగెల। ఆనకట్ట, రైలొంతెన, ఎగుడు దిగుడుగా. కప్పలాగెంతే నల్ల మోటారు బండి, ఎనక కూతంత కంత,

ముందు ఎవడో కడ్డీ తిప్పడం-అందరూ వెనక తోయ్యడం; పక్కన బడ్డీలమీద కూర్చుంటే జెల్లకాయవేసి దింపడం.

ఇంటికెళ్ళి-పందిట్లో కాగితం బుట్టలు, ఇలాయిబుడ్లు, డోలు సన్నాయి, బేమ్మల మంత్రాలు, పూజారి చెవులో పచ్చపువ్వు, ఎద్దుమోపంత బొట్టు, ఎలక తోకంత పిలక, గంధంతో బ్రహ్మగీటు, ఇబూది-మేళకత్తె తైతక్క. ముసిల్ది వొద్దు, కుర్రపిల్లని రమ్మని కుర్రకారు. వొంగుతుంది, అద్దంమీద రూపాయి బిళ్ళని నోటిలో కరుచుకుంటుంది. ఇంకా స్థనాలు తైటపడందే-ఆ వొంపుకి వాహ్వా-గదిలో సిగ్గు-దీపం ఒత్తి కొట్టుకు, మండి చస్తుంది. అంతా చీకటి. కంతలో కాస్తంత వెలుగు: తలుపు సందుల్లోంచి రంగమ్మ చూస్తుంది సోద్దెం; గోడ మూల నక్కింది; పక్కసీదికి రమ్మంటె రాదు; సిగ్గు; నవ్వు-పట్టుగుంటె చాకలిమూటల్లె కిందికి జారిపోతుంది. జిగినీ చేతికి తగిలి మంట; వడ్డాణం మువ్వలు చప్పుడు-మట్టెలు మోటగా, బరువుగా కాలికి తగిల్తె, అమ్మో నెప్పి-ఎప్పుడెళ్ళిపోయిందో, చూస్తే అక్కడలేదు.

మంత్రసాని పిల్లాణ్ని లాగింది-ఆముదం వాసన; ఇంగువ కంపు; జాతకాలు చక్రాలు, రాసులు పిన్నమ్మకి గండం, ఉసిరికాయ పచ్చడి-మూడో కాన్పుకి, పిల్లకి ఆరువేళ్ళు-చుట్ట కాల్చి మొహాన రుద్దారు. చచ్చింది. బోరువర్షం, బురదలో పాతి పెట్టడం-ధాన్యం బస్తాలు గిడ్డంగి-కరణం చిట్టా. కోర్టుకాడ హాజరు. వ్యాపారంలో లాభాలు. యుద్ధం యుద్ధం డబ్బిమ్మన్నారు. డిప్రెషన్. మళ్ళా యుద్ధం. వార్ ఫండులు క్రొత్త మంత్రులు. లాఠీచార్జీలు జైళ్ళు, రాట్నం వొడకడం. ఖద్దరు పంచి. స్వరాజ్యం వొచ్చిందట. ఋణాలు రద్దు దున్నిన వాడిదే భూమి. బ్రాకులు, ట్రాక్టర్లు, పంపులు. రేడియోలు-పెళ్ళానికి చెముకు ఇప్పుడు.

శరభయ్య చెవిదగ్గర ఏదో చెప్తున్నాడు.

"ఊరేగింపు ఒంటెనమీద నుంచేనా?"

"ఓ అల్లాగే"

"పోనీ అటు మానేస్తే?"

"అటు పోవాలి మా పాలిల్లు కాలవ అవతలేగా."

"సరే—చెప్పి ఒస్తా"

అని వెళ్ళాడు శరభయ్య. చెప్పడమేమిటి? ఎవరితో? ఎందుకు? మళ్ళా మంత్రాలు. పెళ్ళాం నుదిటిని సాయంత్రం సూర్యుడంత బొట్టు. చిరకొంగు పీటమీదికి తీసుకో-కాల్తుందిస్మా.

"నారపరాజుగారొచ్చినట్లున్నారు. వారికి ఏంకావాలో కనుక్కోండి"

నమస్కారాలు, నవ్వులు, ఆశీస్సులు.

○ ○ ○

వొంతెనమీద ఊరేగింపు విషయం కనుక్కురమ్మని గుర్నాధాన్ని పంపించారు. కాస్తంత చదువుకున్నాడు, లోక జ్ఞానం అనుభవం వున్న వాడు. ఊళ్ళో వాళ్ళ చిల్లర పన్లు చూసి పెడుతూ ఉంటాడు. వయస్సు నలభయి లోపు. చామనచాయ, పొడుగాటి ముక్కు, నొక్కేసినట్లు కనబడే పొట్టిగా కుదించిన గడ్డం. పెద్ద కనుబొమ్మలు. వెనక్కి వొదిగి, నక్కి, కదిలిపోయే క్రాపింగ్—తెలివైన మొహం. కాలవ దగ్గర కర్ర గుడారంలో ప్రభాకరం లేడు. ఎప్పుడూ వుండడు. ఏదో పనిమీద ఊరంతా తిరుగుతూనే వుంటాడు. చుట్టుప్రక్కల పనివాండ్ర పాకలలో అలజడి లేదు. దూరంగా కుర్రాళ్ళు చెట్ల నీడల్లో ఏదో ఆడుకుంటున్నారు. అందులో ఒకడు మేస్త్రీ తమ్ముడు మార్తాండం-కుంటికాలు వాడిది. పదేళ్ళుంటా యేమో. ఆ చెట్టుకింద పూలదండ కడుతున్నది వాడక్క కొటోలు. నలుపైనా. పిల్ల మొహం బాగానే వుంటుంది. అది ఎప్పుడూ ప్రభాకరంతో పడవ షికార్లేటగా! ఆ కుంటి వెధవకి వొంతెన పన్లలో ఏదో పని చెయ్యమని, కొంత ముట్ట చెబుతాడుట. అడుగో మేస్త్రీ గవిరెడ్డి.

"ఏం రెడ్డీ, సాయంత్రం ఊరేగింపుకి అన్నీ సిద్ధమైనట్లేనా?"

"అరి లోగిలినుండే వొస్తున్నా; భరతరాజుగారు మంచోరే—కాని ఏం ఘనకార్యం చేశాడనండీ, యీపూట దిలాసా?"

"మంచివాడు కనకనే అనుకోరాదూ. షష్టిపూర్తవి-అరవై యేళ్ళు పూర్తి ఐనాక, నలుగురూ గౌరవిస్తున్నారన్నమాట—అదొక లాంఛనం...."

"అంటే, అనుమానం వొస్తావుంటుందిలెండి. కాలవ తవ్వించినాడా,

చెట్లు పాతించినాడా, బరి కట్టించినాడా, పాతర తవ్వాడా, ఏం దది అవి—ఈ పూటేనా, ఉసితంగా భోజనాలెడతారా?"

"ఓ....అరవై ఎడ్లబండిమీద ఊరేగింపు—కొత్తొంతెన దాటి, వారి పొతిల్లు, పొలంగట్టుచూసి, అక్కడో చెట్టు పాత్తారుట—వనమహోత్సవం కూడా ఈ రోజేగా."

"బాగుందండి. ఈ వొంతెన అగుద్దాండి? పచ్చి వొదలండే...."

"మీ ప్రభాకరం ఏమన్నాడు?"

"ఆరి సేచీ ఏమిలేదు లెగండి; పైవోళ్ళే ఓ పదిరోజులు పాలి బరువు పోనీకపోవడం మంచిదవి కాగితం పంపించారుట; పెద్దింజనీరుగారు సయంగా చెప్పారంటండి."

"వాళ్ళు అల్లానే అంటూంటారులే. ప్రభాకరం వొద్దనడంలేదుగా. ఏడీ?"

"అటెటో వెళ్ళారండి. తిండికేరాలేదండి—సూరుడ నెత్తిమీది కెక్కుతుండాడు. మారాజు, ఆకలనక, ఎండనక ఏదో వోటి సేత్తూనే వుంటాడు." అని, గవిరెడ్డి పరీక్షగా చూస్తున్నాడు.

"అలివేలు కొంపకెడితే దొరుకుతాడా?" అని నవ్వుతున్నాడు గుర్నాధం.

"అదొక్కటేనండి యసనం, మరేంచేస్తాడండి-? పెండ్లాం దగ్గర లేదాయె. పడుసుతనం. అది లేకుంటె; దేముడు కాదంటండి!....ఉంటే మట్టుకు ఎవరికేం అపకారం చెప్పండి—దానితో వోమాలి కులికితే ఏం ఆపదొచ్చిందండి—అదెమోరికామిపిల్ల—మొగుడు చచ్చాడాయిరి. మాంచి మోజులోవున్న కన్నెపడుసు. ఏంచేస్తుంది చెప్పండి"

"అదొక్కటే ఐతే ప్రమాదంలేదు. రేపు ఆ పని నీ చెల్లెలికే జర గొచ్చు........"

గవిరెడ్డికి కోపం వొచ్చేస్తోంది.

"మా గౌరాం? దాన్నే మీరనడం?"

"దాన్ననడంలేదు. అతనిమాట...."

"రామ. రామ. ఆయన అట్లాంటివాడు కాడు లెగండి. మంచీ చెడ్డా

తెలును లెగండి....పైపై కబుర్లు చెప్పే వోళ్ళకంటె నయం లెగండి.... నాచేత అనిపించ మోకండి....అన్నన్నా:-స్త్రం—ఒక డా వొకదానితో స్నేహం జరిపితే సరి—ఆడింక ఎందుకూ పనికిరానివోడు. ఎన్ని మంచి పన్లు చేసినా....అట్లాంటివేవీ లేకుండా వున్నా, బైటపడకుండా, ఏచేటా పిల్లల్ని కని, అరవై యేళ్ళొచ్చి అరుగుమీద కూకుని వోడుం పీలుస్తూ, తాటి చెట్లల్లె నిలబడితే చాలు. అయనకి పట్టంకట్టడం—ఊరేగింపులు ఏమైనా సరే, ఈ పూట ఆ ఊరేగింపు ఈ వొంతెనమీదనుంచి రాడానికి వీల్లేదు. నేనే వొప్పను అంతే, మరి....గౌరంట, గౌరి....?"

గుర్నాధం వింటున్నంతసేపూ, అతని వాలకం, ధోరణి చూసి నవ్వుతున్నా, అతని ఉద్దేకం తననికూడా అవహించినట్లు, కళ్ళుచిట్లించి, కనుబొమ్మలు పైకిజరిపి, అసంతృప్తిని ప్రకటించే మాటలు వెదుకుతు న్నాడు. గవిరెడ్డిపై అతనికి కోపంరాలేదు. అతని మాటలవెనక వున్న తత్వాన్ని, దానికి కారణభూతుడైన ప్రభాకరాన్నీ, కోపగించుకున్నాడు.

"ఇంక ఈ గొడవులుండవులే....హాయిగా పెళ్ళాంతో వుండొచ్చు, స్వంతవూరెళ్ళి...."

"అంటే?"

"బదిలీ ఆర్డర్లు వొచ్చేస్తున్నాయి. రేపో, మాపో బిచాణా ఎత్తె య్యాలి."

"ఇదంతా మీరు చేపించినపనే—ఆడకూతురుతో కులికితే మీకెందు కింత కన్నెర....మీకట్లాంటివి దొరకడం లేదనేగా....మనకి లేంది మరొాడి కెందుకు—అది మీపేచీ."

"అవు....

"ఏమైనాసరే, ఈ వొంతెనమీదనుండి ఊరేగింపు వెళ్ళనివ్వను...."

"మధ్య ను వ్వెవడవు?"

"మేస్త్రీని."

పీకమీద చెయ్యిపెట్టి వొక్కతోపు తోశాడు గుర్నాధం. గవిరెడ్డి కొంచెం వెనక్కి వొంగివుండడంవల్ల పడిపొయ్యాడు. అతని చెల్లెలు గౌరి పరుగెత్తుకుంటూ వొస్తోంది. పిల్లలు ఆట నిలుపుచేసి చూస్తున్నారు. కుంటి

తమ్ముడు మార్తాండం, కుంటుకుంటూ వొస్తున్నాడు.

"గట్టంతా బాగుచేయించి, సాయంత్రానికి అన్నీ సిద్ధంచెయ్యమని చెప్పు మీ ప్రభాకరంతో."

అని తొందరగా నడవడం సాగించాడు గుర్నాధం.

○ ○ ○

ఆమె కళ్ళంట నీళ్ళు కారుతున్నాయి—వొక్కటొక్కటే, అతని నుదుటిమీదికి జారి వేడికి కరిగిపోయిన మంచుకణాల్లె, మాయమవుతున్నాయి. మోచెయ్యి అడ్డుగా పెట్టి, వేళ్ళతో కళ్ళని తుడుస్తున్నాడు. ప్రభాకరం చేతిమీదికి జారింది నిప్పుకణం; యుగయుగాలుగా రాజులతో పాటు చితిమీద రాణులు పడ్డప్పుడు, ప్రజ్వరిల్లిన జ్వాలలో వేడి ఆమె కళ్ళలో నిప్పుకణమైంది.

అతని చెయ్యి మరిలేవదు-తాత్కాలికమైన వాంఛతో తృప్తిపడి, మరో స్త్రీ కంఠంకిందికి జారిన తనచెయ్యి లేవదు. ఆ క్షణాన లోకమంతటా ఎందరు తమ చేతులు పరస్త్రీ కంఠంకిందికి జాచి, కన్నీటి పదునికి వేళ్ళు తెగ్గొట్టుకుంటున్నారో! స్త్రీత్వానికి ఆ బలి తప్పదు. తన పర, నిన్న రేపులు లేవు. మానవ శారీరక వ్యవస్థ సృష్టి ప్రారంభంలో సముద్రపు టొడ్డున అవతరించిన ప్రథమ ప్రాణి తపన. దాని బ్రతుకు, తపన, కొట్లాట, కలవడం, విడిపోవడం క్షణికమే. చస్తుంది. కాని ప్రాణులు అనంతం. నక్షత్రాలే వొకదానిచుట్టు వొకటి తిరుగుతుంటాయి. దేన్నో వెదుకుతూ పెరిగిపోతూంది విశ్వం

తెగినా చేతికి తెలుసు—ఆ మెత్తదనం, గుండ్రతనం, స్తనాల నడుమ బిగి, నడుంకింద వొంపు మెడచుట్టూ రక్తనాళాల పసుపు నృత్యం, వాంఛతో పీక నులిమెయ్యడం, ఎన్నో కంఠాలు పాడలేక పగుల్తాయి; పాడి మూగవవుతాయి. పురుషుడి చేతిలో సమాప్తం. దీనికి గాజులెందుకు? దుస్తులెందుకో! ఓరచూపులు, ముసిముసి నవ్వులు, సిగ్గుతో ఉండచుట్టుకుపోయి, ముత్యపుచిప్పలో దూరిదాక్కోడం, వెదకడం, పైకిలాగి ఎండలో నిలబెట్టిచూస్తే ఏమీలేదు. దుస్తులు, గాజులు, మట్టెలు, కడియాలు, లోలాకులు, ఉంగరం-మాంసంముద్దకు ముస్తాబు.

''ఎందుకు? సముదాయిస్తున్నాడు.

"మీరు కనబడరా?"

"ఎప్పుడన్నా వొస్తుంటాలె"

''మీతో వొచ్చేదా?"

"అమ్మో!''

''అంతేనా?" అతని మెడచుట్టూ చేతులు బిగించి, వక్షంపైన మొహం ఆనించి ఏడుస్తోంది అలిమేలు.

"అంతే జీవితం. ఏదీ శాశ్వతం కాదు. శాశ్వతం కాదు గనకనే అంత కావాలనిపించడం. ఏదీ ఎప్పుడూ వుండాలనుకోకూడదు. మధ్యాహ్నమే వొచ్చింది ట్రాన్స్‌ఫరైనట్లు....ఏం చేస్తాం''

"ఆపించుకోలేరా?"

''నేను యత్నం చెయ్యను....ఉన్నాం, కలిశాం; లేదు విడిపోతాం. నీ బ్రతుకు నీది, నాది నాది. అంతే జీవితం. ఎవర్నన్నా పెండ్లి చేసుకోరాదు?"

''అమ్మో, ఇంకేమన్నా వుందీ—ఈ ఊళ్ళో......''

''మరో ఊరు వెడితే నేం?

"అమ్మరాదు. ఇక్కడే వుంటా. అంతే జీవితం...." అంది అలిమేలు.

నవ్వుతున్నాడు ప్రభాకరం.

ఎవరో ఆమెని పిలుస్తున్నట్లుంది. ఆమె లేచి వెడుతోంది

ఇంక ఆ గదిని మళ్ళా చూడదేమో....పరకాయించి చూస్తూన్నాడు. అక్కడ పిడకలు, కట్టెలు, పాత కిరసనాల డబ్బాలు, గోనెసంచులు, తాళ్ళు, వ్రేలాడతీసిన ఉట్టి....దాని చుట్టూ సాలిగూడు, గోడని కంతలో బల్లి, ఇటు కంతకి అద్దం; అందులోంచి సూర్యకిరణం; చూరుకి బూజు.... వీటిని భరించడం ఆమె శరీరంకోసం. అదే....ప్రేమని దగాచేసుకోవడం

దేవికో! స్థూల జగత్తు యథార్థం....ఆ జగత్తంతా ఆమె శరీరం ఐనప్పుడు, ఇదంతా మాయ. కన్నుమూస్తే ఏదీలేదు. కన్నుమూసినా రెప్పలకింద ఆమెఉనికి....వింత శరీరం. వొంపులబరువు. ఆనాడు వెన్నెల్లో పడవలో తనమోకాళ్ళమీద ఆమెతల, వింతశ్వాస, పిల్లగాలులు ఆమె జెడలో ఆ దాగిలి మూతలు; కనురెప్పపైకికదిపి, కోరగా, ప్రక్కగా వొకమూలకి నల్ల గుడ్డు కదిపితే, ఆ చూపులో ఎంతటి కాంక్ష, క్రౌర్యం ఉన్నాయో అతనికి తెలుసు. లోకంలో నిర్దయ అంతా ఆ కంటిలోకి చేరుకుంటుంది....చూపుగా తనమీద వాల్తోంది. ఇవాళతో ఆ చూపు దొరకదు. ఆమెకి అన్యాయం చేశాడా? ఏదో పనిలో ప్రవేశపెడితే....పోనీ సినిమాలో జేర్పిస్తే....భుక్తి గడిస్తే చాలదు. ప్రేమ, ఆదరణ, సంతానం, తనఇల్లు....ఇవన్నీ కావాలి. మరెవరన్నా ఆమెని చేరదీసి, సమకూర్చాలి. తేనెపట్టుని కదిపినట్లైయింది. రాణి ఈగ మధ్యలో ఉంటుంది. పనివాండ్రు వస్తారు. మొగాళ్ళంతా పనివాండ్రైన తేనెటీగలు. ఒకడు పోతే మరి ఒకడు, వెనకటి సమాజా లంతేనట.

ఆమె ఏదో తెస్తుంది తినడానికి. కవరులో నోట్లుపెట్టి, చాపమీద దిండుకింద పెట్టి, తలుపులు దగ్గరగా వేసి, దొడ్డి గుమ్మంవైపు గేటుతీసి పొలం గట్టున నడుచుకుంటూ వెడుతున్నాడు ప్రభాకరం. ఎవరో పిలుస్తున్నారు. వెనక్కి తిరిగాడు. ముత్యాలు....మునసబుగారి తమ్ముడు. ఆగాడు.

"మీ కోసమే" అన్నాడు ముత్యాలు.

ప్రశ్నార్థకంగా చూశాడు.

"అలిమేలు ఇంటినుంచే వస్తున్నాను. భరతరాజుగారి ఊరేగింపు ముందు ఏమన్నా పాడమంటున్నారు. కనుక్కుందామని వొచ్చాను. రానంది. మీరేమన్నా నచ్చచెబితే వస్తుందేమోనని...."అన్నాడు ముత్యాలు.

"మధ్య నేను చెప్పడ మేమిటి? నాకేం అధికారముంది?"

"మీకు బాగా పరిచయంట."

"మీరూ" ట, తత్వంలోకి దిగుతున్నారా? చదువుకున్నవారు కదా!"

"పొరబాటే. పరిచయం లేదంటే క్షమించమంటాను."

"మీతో అబద్దమాడను. ఉంది. దానివల్ల ఎవరికీ అపకారం లేదనే భావిస్తున్నాను."

"ఊళ్ళోవారు అల్లా అనుకోడంలేదుగా. వాళ్ళకిదే ముఖ్యం. ఇతరత్రా మీరెన్ని మంచిపనులు చేసినా లెక్కలోకిరావు."

"చెడ్డపనులు చేస్తేకాని మంచి పనులు సాధ్యంగావు."

"పొద్దున్న ఈ వాదమే జరిగింది. భరతరాజుగారు, ఏ చెడ్డపనులూ చెయ్యలేదు. ఆయన ఏ మంచిపనికూడా చెయ్యలేదు ఆయన కెందుకు ఇంత సత్కారం అంటే వాళ్ళకి కోపం వొచ్చింది. మీ విషయం ఉదహరించా. మరీ రెచ్చి పోయ్యారు." ఇద్దరూ మెల్లగా కాలవ వొడ్డుకేసి నడుస్తున్నారు.

"ఏమో ముత్యాలరావుగారూ, ఏ పనీ చెయ్యకపోవడమే మంచి దనుకుంటా. మనం ఉన్నా లేకపోయినా సమాజం మారుతూనే వుంటుంది. దాన్ని బాగుచేస్తున్నాం గనుక, కాస్త స్వార్ధానికీ స్వంత ఆనందాలకీ ఒడిగడతాం. ఇవి పట్టించుకోకండీ అనడం మూర్ఖత్వమేమో. భరతరాజు గారే ధన్యజీవి. ఈ సత్కారం తగిందే ననుకుంటున్నాను."

ముత్యాలు ఆశ్చర్యపడ్డాడు.

"మీరూ అల్లానే అంటూన్నారేమిటి? రావిచెట్టు వొందేళ్ళు బ్రతుకుతుంది....ఏంలాభం?"

"అల్లా అనకండి, చల్లటినీడని ప్రసరిస్తుంది. భరతరాజుగారి సంతానంలో, ప్రముఖవ్యక్తి బైలుదేరొచ్చు. అదివృధా జీవితం అనుకోను."

"ఆధునిక తత్వం ప్రకారం, ప్రముఖవ్యక్తి కావాలంటే, స్వార్థం కోసం కొన్ని చెడ్డపనులు చేశాకనే మంచిపనులకు పూనుకోడం జరుగు తుందనిగా నే అనుకోడం. భరతరాజులాంటి వొకరిద్దరు వ్యక్తుల్ని మిన హాయిస్తే, పూర్తిగా మంచి వ్యక్తులంటూ వుండరనుకుంటాను...." ప్రభాకరం పడవలోకి దిగాడు; ముత్యాల్ని లోపలికి దిగమని చెయ్యి అందించాడు.

"ఆయన పూర్తిగా మంచివ్యక్తని మీ కెట్లాతెలుసు? ఇంత వరకూ పట్టుబడని దొంగ అనుకోకూడదు...." అన్నాడు ప్రభాకరం.

"ఇహనేం! నే అన్నదే మీరూ అంటున్నారు."

"ఊరికే అంటున్నానండీ, ధర్మం నాలుగు పాదాలమీద "కలి" నడుస్తోందంటె: వొకపాదం భరతరాజుగారిదే అనుకోకూడదా?"

"నిరుపయోగమైన జీవులు సమాజానికి అవసరం. ఉపయోగపడే చెడ్డవారి చెడ్డతనం లోతుని కొలవాలంటే వ్యర్థ జీవులవసరం. నాతో రారా?"

"లేదు. అలివేల్ని పాడమంటున్నారు. ఒంట్లో బాగాలేదు. రానం టోంది. మీరొచ్చి చెప్పకూడదూ?"

"జాతీయగీతం, ప్రార్థన గీతాలు, మా పనివాళ్ళ పిల్లలకి నేర్పిస్తు న్నాను. వాళ్ళంతా అక్కడికే వెళ్ళారు, అవి పాడ్డానికి...."

"ఓ, అల్లాగా...."

"మరి మీరు రారూ?"

"ఊరేగింపు చూస్తాలెండి"

"మరి ఈ వొంతెనమీద వెడతారుటగా."

"వెళ్ళొచ్చు."

"మీ డిపార్టుమెంటు కూడదంటున్నారుటగా."

"ఈమధ్య వర్షాలులేవుగా. పరవాలేదనుకుంటా."

"మళ్ళా వొక్కసారి ఆమెని అడిగిచూస్తా." అని ముత్యాలు వెనక్కి తిరిగి నడవడం సాగించాడు. ప్రభాకరం పడవ ఆవలిగట్టుకి వెడుతోంది.

o o o

పందిట్లో ప్రముఖుల సందేశాలు; కార్యక్రమం దిగ్విజయంగా జరగాలని అభిలషిస్తున్నాను, రాలేకపోయినందుకు చింతిస్తున్నాను. భరత రాజుగారి సేవ నెరుగనివారెవరు? సన్నాయి విలపండి. పిల్లల జాతీయ గీతం పాడ్డానికి సిద్దంగా వున్నారా? బాండ్ మేళం ముందుండాలి. ఎడ్ల మువ్వల చప్పుడు. ముందు జత, "పరకాళా" ఏదీ? పిల్లలు దూరంగా వుండండర్రా.... మైక్ చెడిపోయిందా? దీక్షితులుగారు కాఫీ పుచ్చు గున్నారా? కటాన్నాలు, చదివింపులు— చిట్టా వ్రాయవోయ్ చెట్టియ్యా! పూలదండ లొచ్చాయా? "తొందర పనుంది. ఈ బస్సుకి పోతా." నేనూ వెళ్ళాలి తెలుసుగా ఇంటిదగ్గర ఎవ్వరూలేరు." ఆడంగులు అటు, ఆ అరుగుమీద. చాపలు తియ్యండి— పిల్ల పాడుచేసింది. ఏడుపులు, సకిలింపులు, తెగిన కాగితంబుట్టలు; దారాలు, వాడినపూలు, గాజులచప్పుడు, సిల్కుచీర రెపరెపలు, శాస్త్రిలుగారి గోచీ వూడిపోతూంది— కొట్లోంచి అద్దం, దువ్వెన తీశాడు సీతాపతి. పందిట్లోకి గాడిదొచ్చింది— తరమండి బండి అటు నుంచి పోనియ్యి ఇటు జనం; ఫిడేలు తీగెలు బిగించండి: దాసుగారు గొంతు సవరించుకుంటున్నాడు. ఊడిన మువ్వలు కాలికి బిగిస్తు న్నాడు. ఎర్రకలదువా చెమటతో తడిసింది. కాస్త టీ పుచ్చుకోండి "ఈ చెమట చాలకనా?" ఉండండయ్యా, విశ్శబ్దం. ఆయనేదో మాట్లాడు తున్నాడు.

o o o

మార్తాండం కుంటుకుంటూ వొచ్చాడు, గుడారంలోకి. "ఊరేగింపు బైలుదేరిందంటండి."

"ఇదుగో ఈ టీ నీళ్ళు త్రాగు" అని, కప్పు అందించాడు ప్రభాకరం, మార్తాండం కాలు పరీక్షిస్తున్నాడు. కాలు బాగుచేసే మార్గం ఏదన్నా వుండాలని డాక్టర్లకి వ్రాశాడు. ఆపరేట్ చేసి, కట్టుకడితే కొంత బాగ వచ్చున్నారు.

"నాతో ఊరికొస్తావా-కాలు చూపిద్దాం."

"ఓ" అని నల్లకుక్కని తరుముతూ వెళ్ళాడు. అక్క గౌరి పూల దండ జడలో అమర్చుకుంటోంది. పూలు తీసుకున్నాడు. ఆమెని దగ్గరకు లాక్కున్నాడు. కళ్ళలోకి చూశాడు.

"పూలు అమిర్చేదా?" అని పూలు జడలో పెడుతున్నాడు.

"పాఠం చదివావా.... మరి పందిట్లోకి వెళ్ళలేదే పాడ్డానికి?"

"నన్ను పిలవలేదండి.... నా మొహం నాదేం పాట. అలిమేలు రానందిగా. మీకదంటె ఇష్టంకదూ!" అంది కళ్ళు పెద్దవిచేసి.

"నువ్వన్నా ఇష్టమే. నా కందరూ ఇష్టమే."

"నేనంటెకూడా....నలుపుగా...."

"నలుపంటె మరీ ఇష్టం."

అమాయకంగా నవ్వింది. ఆమె కళ్ళు గర్వంతో అందంగా మెరుస్తున్నాయి. పాడుకుంటూ వెళ్ళింది గౌరి. కరీమ్ గది శుభ్రం చేస్తున్నాడు. ప్రభాకరం ఒంతెనకేసి వెళ్ళాడు. టెంట్లు, పాకలు, కలప, సున్నం బట్టీ, ఇటికల బారులు, సర్వీచెట్లు దాటాక ఫర్లాంగుదూరంలో ఉంది కొత్త ఒంతెన. నాలుగైదు ఎడ్లబండ్లు విప్పి ఉన్నాయి. బండ్లవాళ్ళు కాలవలో స్నానానికి దిగారు. దిగువున మరికొన్ని చెట్లు, అక్కడంతా మెత్తటి ఇసుక. నీళ్ళదగ్గిర మెట్లు పచ్చిగా ఉన్నాయి. పూర్తిగా ఆరలేదు. ఇసుకలో కూర్చున్నాడు ప్రభాకరం.

o o o o

సూర్యుడు మేఘం వెనక దాగాడు, వేడికి తట్టుకోలేక; మరికొన్ని మేఘాలని వొచ్చి పంచుకోమంది పిల్లమేఘం. దానికి దట్టమైన చర్మం. నిండైన స్తనాలు, పిరుదులు—— స్త్రీకి మల్లె అంతా శరీరమే-ఉంది, లేదు, చేతిలోకి లాక్కొనేటందుకు కేంద్రం లేదు- హృదయమేలేదు. నా చీర ముస్తాబు చూడమంటూ మరొక మేఘం. సూర్యుడు ఉక్కిరి బిక్కిరవుతున్నాడు. ఊపిరాడక కిందకి దిగిపోతున్నాడు. అలిసి ఒదిలన రక్తపు చమటచుక్కలు కాలవనీటిలో పడుతున్నాయి. పిట్టల జంట చేపలకోసం నీటిపై పొడుస్తున్నాయి. నీటిలో మేఘాలు కెరటాలుగా వొడ్డున కప్పల్ని కలవరపెడుతున్నాయి. కోట బురుజులలాగు మేఘాలు పేరుకున్నాయి. శత్రురాజులు కోటని పడగొట్టడానికి ప్రేల్చిన ఫిరంగులల్లె గర్జిస్తోంది. కాలవ కదలడంలేదు. ప్రసవవేదన పడుతున్న స్త్రీ వక్షంకిమల్లె లేచి పడుతోంది; పిట్టలు ఆకుల నీడల్ని వెదుకుతున్నాయి. అవతల వొడ్డున బాణసంచా ప్రేల్పుడు-జనం రొద; బ్యాండ్ వాద్యం ఒంతెన ముందు దుమ్ము లేస్తోంది, ఆకాశం చీకటైంది. మేఘాలు బెదిరి చిందరవందరగా పరుగులెడుతున్నాయి. మెరుపు వెంటాడుతూంది. మేఘం, ఓడి, లొంగిపోయి, ఏడ్చి, వర్షిస్తోంది— బరువైన వర్షపు చుక్కలు, కాలవ మూల్గుతోంది. బళ్ళవాళ్ళు ఎడ్లని దూరంగా లాక్కెడుతున్నారు. పాగాలుచుట్టారు, తాటాకు గొడుగులు తీశారు. దూరంగా బాణసంచా లేచి మేఘాలని కసురుతోంది. జనం ముందుకి కదిలారు. ఎడ్లబండ్లు వొంతెనమీది వొచ్చేస్తున్నాయి. నాలుగుజతల ఎడ్లు-ఇరవై, వొంతెన చివరికి కొచ్చేశాయి. ఇరవై ఎనిమిదో జత వొచ్చేసింది, బ్యాండ్ మోగుతోంది. జువ్వలు లేస్తున్నాయి. తడిసి తుస్‌మని కాలవలోకి జారిపోతున్నాయి. జనం దాటేశారు, ఎడ్లజతలు వొంతెన దాటేశాయి. వెనకబండి అందులోముందు తోలేవాడు, పెద్దెయ్య, గుర్నాధం, నడుమ భరతరాజుగారు, ఆయనపక్క సతీమణి. వెనక మరొకబండి, దానివెనక జనం నడుస్తున్నారు. రాధయ్య శ్యామలరావు

వీరపరెడ్డి, తిరుపతి, దుర్గ, గౌరి, తమ్ముడు మార్తాండం, కుంటుకుంటూ, వొంతెన దాటేశాయి ఎడ్లజతలు. చివరిజత కుడివైపుకి మళ్ళింది....ఎడమ వైపుకి బదులు. చక్రం వోరగా పెట్టిన ఇనపబద్దీలకు తగిలింది; వాటికి ఏటేగా పెట్టి త్రాళ్ళతో కట్టిన బోటుకర్రలు కదిలాయి. ఇనపకడ్డీ జారింది. తాళ్ళుతెగాయి. బండితాతిని కొట్టుకుంది. రాతిగోడలో వెనకభాగం జారి నీళ్ళల్లో పడింది బండి పక్కకి గోడమీదకి వాలింది. భరతరాజు కాలవలో పడ్డాడు. బండివాడు అటు దిగాడు. మెఱుపు వెలుగులో క్షణం కనబడిన దృశ్యంలో; మరికొందరు నీళ్ళల్లో పడ్డదృశ్యం చూశాడు ప్రభాకరం. వొంతెన పక్కన గోడదగ్గర నిలబడి కాలవలోకి దూకాడు, బండ్లవాళ్ళు కొందరు దూకారు. కేకలు అరుపులు-జనం; బండ్లు, వొంతెనదాటి ఇవతల వొడ్డుకి చేరు కున్నాయి. ప్రభాకరం మెడచుట్టూ భరతరాజు చేతులు బిగించాడు. గట్టిగా పట్టుకున్నాడు. మరొక బండివాడు సహాయంతో ప్రభాకరం, భరతరాజుని ఒడ్డుకి చేర్చాడు. మరోచేత్తో మార్తాండాన్ని కూడా నీళ్ళల్లోంచి ఒడ్డుకి ఈడ్చుకొచ్చాడు. కిందంతా ఇసుక....భరత రాజుకి దెబ్బలు తగలలేదు. క్షేమంగావున్నాడు. ఒడ్డున కొస్త తేరుకున్నాక ఊరేగింపు కొనసాగాలన్నారు. పావుగంటలో వర్షం నిల్చిపోయింది. ప్రభాకరాన్నికూడా తమ బండిలో ఎక్కమన్నారు. మార్తాండాన్ని మెల్లగా బండిలోకి ఎక్కించి, తన ఒళ్ళో పడుకోబెట్టు కున్నాడు ప్రభాకరం. ఊరేగింపు కొనసాగింది. ఆకాశం నిట్టూర్చింది. కాలం కునుకుతియ్యడానికి, కెరటాలు దుప్పటిని సర్దుకుంటోంది. చెట్లు చోద్యంచూస్తున్నాయి. కాళ్ళకింది బురద రోదిస్తూంది. బ్యాండ్ మోగుతోంది. బాణసంచా రంగు పూలు జల్లుతోంది. కుర్రాడు కరీమ్‌కూడా జువ్వలు వేస్తున్నాడు.

ం ం ం ం

రాత్రి పద్దైంది. ముత్యాలొచ్చాడు.

"మీరు లేకుంటె భరతరాజు ఏమయ్యేవాడో!" అన్నాడు.

"నేను చేసిందేమీలేదు. అంతా ఆ బండివాడే."

"అట్లా అనకండి. చూసినవాళ్ళు అన్నమాటే. గొప్పత్యాగం చేశారు" అన్నాడు.

"ఏ తాగ్యమూ చెయ్యలేదు. ఆ మార్తాండంనీళ్ళల్లో పడ్డాడు. వాణ్ణి రక్షించడానికేనే దూకుత. మరి నాకు శెలవిప్పించండి" అన్నాడు ప్రభాకరం.

"అదేమిటి?"

"నాకు ట్రాన్స్ఫరైంది. నా బదులు కాంతారావుని వేశారు. అతను రేపునయపొమే వొస్తున్నాడు...."

"అప్పుడే? నాకింకా తెలియదే?" అని ఆశ్చర్యం ప్రకటించాడు ముత్యాలు.

"మీరు మా ఊరికి చేసిన మేలుకి మంచి కృతజ్ఞతే చెప్పుకున్నారు మావాళ్ళు"

"వొంతెన కట్టడం నా పని. అందులో విశేషం ఏమీలేదు."

"మిగతా పనులెన్నో వున్నాయి-జీతంలేని పన్లు...."

"ఆమాత్రం దయ ఉన్నందుకు నే నెప్పుడూ కృతజ్ఞుణ్ని...."

ముత్యాలు వెళ్ళాడు.

ప్రభాకరం కాలవ వొడ్డుకి నడుచుకుంటూ వెళ్ళాడు. సన్నటి చందమామ వెలుగులో ఆవలి వొడ్డున....అలిమేలు కనబడింది. పడవ తీసుకురమ్మని సంజ్ఞ చేస్తోంది. అతను చూశాడు. వెళ్ళిపొమ్మని కేక వేశాడు. అతని కేసి చూస్తూ ఆమె వెళ్ళిపోయింది. చక్రాల పడవని కాలవలోంచి పైనవొడ్డుకులాగి పడేశాడు. వొంతెన వేపుకి నడిచాడు. ఊడిన ఇనపకడ్డీని, పడినచోటు కర్రలని పరీక్షించాడు. వీటిని ఎవరో వొదులుచేశారు; ఎవరో కఠినుడు, దుర్మార్గుడు. తనని యీ ప్రమాదానికి కారకుడుగా చెయ్యాలని. తనంటె ఎందుకంతపగ? తను ఏ అపకారం చేశాడని?

ఆమెతో వున్నందుకేనా యిదంతా? అది అంత ముఖ్యమా సంఘానికి? సౌందర్యం కావాలతనికి; దుర్గకళ్ళల్లో విర్మలత్వాన్నెరుగును! గౌరి గుండెల్లో వికసించని పువ్వు పరిమళం తెలుసతనికి. అలిమేలు కంఠంలో నీడ లెరుగునతను. ఇవి అంతరంగ అనుభవాలు— వ్యక్తిగతం. అది నిప్పు; సంఘర్షణ—జీవితం వేసిన మైలురాళ్ళు. సమాజం వాటిని పీకటం దేనికి? అలిమేలు వొస్తానంటే వొద్దన్నాడు—తన కెందుకంత భయం—ఈ ఆఖరు రాత్రి?

బండివాళ్ళను లేపాడు. వారి సహాయంతో కర్రల్ని తాళ్ళతో బిగించాడు. ఇనప కడ్డీలవి బిగించాడు. బోటు పెట్టాడు. రాతిని సర్దాడు. "అమ్మయ్య వొంతెన బాగైంది" అనుకొని సంతోషంతో నిట్టూర్చాడు. ఆ ఆనందం ఎవ్వరికి తెలియదు. ఆకాశంకింద నీటి సముక్షాన, చెట్లనీడల నడుమ, భూమి పాదాలకింద పవ్వళించినప్పుడు, సంతోషంతో కొట్టుకునే గుండెదడ లోకానికి తెలీదు. తెలీదనుకోవడంలో ఆనందం వుంది.

ఏదో చప్పుడైంది, మనిషి నీళ్ళల్లో పడ్డట్లు. అవతల గట్టున నీళ్ళల్లో, వొంతెన దిగువగా, కాలవలో కొట్టుకు పోతోంది ఆ వ్యక్తి. చేతులు, తల, కాళ్ళు, మునిగితేల్తూ వొంతెన కిందుగాదిగువున కొట్టుకెడుతోంది పరుగెత్తాడు ప్రభాకరం- అవతల వొడ్డుకి చేరడం ఎల్లా? ఇంకా పరుగెత్తాడు. చొక్కా తీసేశాడు. పెద్దకర్రని చేత్తో పుచ్చుగుని నీళ్ళలోకి దిగాడు కాలవలో ఈదుకెడుతున్నాడు. ఆ వ్యక్తి ఇంకా దూరమైపోయింది. అందడంలేదు; ఎల్లా? గుడారం దగ్గిర వొడ్డునున్న చక్రాల పడవని నీళ్ళల్లోకి నెట్టి అందులో అవతల వొడ్డుకి వెళ్ళాడు. వేగంగా తొక్కుతున్నాడు పెడల్సని—జోరుగా వెడుతోంది. పడవ. ఇప్పుడు చేతులు, కాళ్ళు కనపడ్డంలేదు. ఐపోయింది. ఆవలివొడ్డుకిదూకి పట్టుగున్నాడు-అలిమేలు. తన చేతుల్లో—వొక్క సమస్యకూడా—తనకి మిగల్చక వెళ్ళింది ఆమెకీ, తనకీ, సమాజానికీ, ఎవ్వరికీ సమస్యలు లేవు. అంతే జీవితం—అవే ఆమె ఆఖరి మాటలు కూడ.

రచన కాలం:- 1965 అక్టోబరు